అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

పోషణ్ మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, తదితరులు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 13: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రీయ పోషణ్ అభియాన్ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ, వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సరఫరా, మంచి నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమున్న మరమ్మతులు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్థలం ఉంటే పెరటి తోటలు పెంచాలన్నారు. పోషణ్ మాసోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. పూర్వప్రాథమిక విద్యపై దృష్టి సారించాలని, 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

షీ-షట్లర్ బస్సు ప్రారంభం

బస్సును ప్రారంభిస్తున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, సెప్టెంబర్ 13: పారిశ్రామికవాడలో మహిళల సురక్షిత ప్రయాణానికి సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్‌లో ప్రత్యేకంగా ఉచిత బస్సు సౌకర్యం కలిస్తున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో షీ-షట్లర్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవాడలో విధులు నిర్వహిస్తున్న మహిళల భద్రత, సురక్షిత ప్రయాణానికి సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యూలాండ్ పరిశ్రమ సహకారంతో రూ.34 లక్షల బస్సును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సు గాగిల్లాపూర్ నుంచి జిన్నారం రూట్లో రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నడుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్సీ వైస్ చైర్మన్, అదనపు ఎస్పీ సంజీవరావు, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి రమణారెడ్డి, ఎస్ఎస్ఎస్సీ మేనేజ్‌మెంట్ సభ్యులు, న్యూలాండ్ పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్ రవి, శారధ పరిశ్రమ కార్యదర్శి అశోక్, రాము, రామకృష్ణ, డీవీ రెడ్డి, శ్రీధర్‌నాయక్, భాస్కర్, న్యూలాండ్ అడ్మిన్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు ధ్వంసం

మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 13: మండల సమీపంలో పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తుండడంతో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు దాడులు చేసి గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. శుక్రవారం నమ్మదగ్గ సమాచారంతో గ్రామ సమీపంలో బిజిలీపూర్ అశోక్ తన పత్తి చేనులో సాగు చేస్తున్న 158 గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. ఒక బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు గాంధీనాయక్, చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ అలీమ్, పోలీసులు గోపాల్, అనీల్, మల్కయ్య ఉన్నారు.

ఏచూరి జీవితం ఆదర్శప్రాయం

నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరనిలోటని, ఆయన జీవితం భావితరాలకు ఆదర్శప్రాయం అవుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, పెప్సికో పరిశ్రమలో ఏచూరికి నివాళి అర్పించి ఆయన పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్, సభ్యులు లక్ష్మి, నర్సింలు, యాదగిరి, నాయకులు అశోక్, శ్రీనివాస్, నాగభూషణం, బాలరాజు, కృష్ణమూర్తి, కార్యాలయ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే

కాముని చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, సెప్టెంబర్ 13: కల్హేర్ శివారులోని కాముని చెరువు కట్టపై ముండ్ల పొదల తొలిగింపును ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పరిశీలించారు. కామునిచెరువు కట్టకు ఇరువైపులా సర్కార్ తుమ్మ(ముండ్లకంప) చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో గ్రామనికి చెందిన కొందరు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి కంప చెట్లను తొలిగించాలని ఆదేశించడంతో చర్యలు చేపట్టారు. ఉపాధి కూలీలతో చెరువులోని పూడిక తొలిగించేకంటే కాల్వల్లో పూడిక తీస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. హరితహారం కార్యక్రమంపై ఆరాతీశారు. కార్యక్రమంలో నాయకులు వీర్ శెట్టి, సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, కోడి గంగారాం, బేగరి సాయిలు, కేశ్‌గొండ తదితరులు ఉన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కల్హేర్: అడివప్పతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, సెప్టెంబర్ 13: బీఆర్ఎస్ నాయకుడు నాగ్‌దర్ మాజీ ఉప సర్పంచ్ అడివప్ప అనారోగ్యంతో శస్త్రచికిత్స పొంది తిరిగి ఇంటికి రావడంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా అడివప్ప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ రాజు ఉన్నారు.

సిర్గాపూర్‌లో..

సిర్గాపూర్, సెప్టెంబర్ 13: మండలంలోని పోచాపూర్, ఖాజాపూర్ గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు ధైర్యం చెప్పి అండంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు కృష్ణాగౌడ్, బషీరుద్దీన్, శంకర్, నారాయణ, మారుతి పటేల్ తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా విడుదల

కంది, సెప్టెంబర్ 13: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కంది మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో ఓటర్ జాబితాను ప్రచురించారు. శుక్రవారం కంది ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి పంచాయతీలకు సంబంధించిన ఓటర్ లిస్ట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలోని 212 వార్డుల్లో 37,312 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు సవరణకు అవకాశం ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు స్వీకరించాలి

సిర్గాపూర్, సెప్టెంబర్ 13: మండలంలోని అన్ని గ్రామాల్లో వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు లిస్టును ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీవో మల్సూర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఓటర్లకు ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 21వ తేదీ వరకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మంచారి, ఏపీవో బస్వరాజ్, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

లిస్టుల్లో పేర్లను సరి చేసుకోవాలి

కోహీర్, సెప్టెంబర్ 13: మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న ఓటరు లిస్టుల్లో పేర్లను సరి చూసుకోవాలని ఎంపీడీవో భారతి కోరారు. కోహీర్‌లోని ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఓటరు లిస్టులను ప్రదర్శించారు. ఓటరు లిస్టుల్లో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా వెంటనే సంబంధిత పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు. 21వ తేదీన తుది జాబితాను విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వినోద్‌కుమార్, తదితరులున్నారు.

కోహీర్: జహీరాబాద్‌లో అరెస్టయిన బీఆర్ఎస్ నేతలు

జిన్నారం: ఖాజీపల్లిలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రాయికోడ్: ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

రాష్ట్ర సర్కారుపై గులాబీ కన్నెర్ర

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని నిరసిస్తూ మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు హరీశ్‌రావు పిలుపుతో సైబరాబాద్ పోలీసు కమిషరేట్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్ వెళ్లకుండా గురువారం అర్ధరాత్రి నుంచే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా రాజధానికి వెళ్తారనే అనుమానంతో గులాబీ నేతలను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం అప్రజాస్వామికమని, అరెస్ట్ చేసినంత మాత్రాన ఉద్యమాలను ఆపలేరన్నారు. రాహుల్‌గాంధీ భారతదేశం పేరును చెడగొడుతున్నాడని, రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చెడ్డ పేరు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేసిన అరాచకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ఉద్యమాలతోనే పుట్టిందన్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 3

కొండాపూర్: పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన నేతలు

రామచంద్రాపురం: హౌస్ అరెస్టయిన బీఆర్ఎస్ నేత సోమిరెడ్డి

నారాయణఖేడ్: పోలీస్‌స్టేషన్‌లో..

నాగల్‌గిద్ద: అరెస్టయిన గులాబీ నాయకులు

మనూర్: అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామచంద్రాపురం: తెల్లాపూర్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్ హౌస్ అరెస్టు

పటాన్‌చెరు: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

సదాశివపేట: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి: బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



గుమ్మడిదల: మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, గౌరీశంకర్

అందోల్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



హత్నూర: పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి దామోదర రాజనర్సింహ

మాట్లాడుతున్న మంత్రి దామోదర

అందోల్, సెప్టెంబర్ 13: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగుపేటలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవానికి ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, ఎంఈవో కృష్ణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు లక్ష్మణ్, మాణయ్య, నరోత్తం, మదన్ మోహన్, రాజమల్లు, మహేశ్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు ఘన సన్మానం

అధ్యాపకులను సన్మానిస్తున్న తారా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 13: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తమ కళాశాల నుంచి ముగ్గురు అధ్యాపకులకు అవకాశం కల్పించడం కళాశాలకే గర్వకారణమని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ అన్నారు. ఇటీవల రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్న ముగ్గురు అధ్యాపకులను కళాశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ అధ్యాపకులుగా తమ కళాశాల నుంచి ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన వారిలో కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జగదీశ్వర్, ప్రభుత్వ పాలన అధ్యాపకురాలు డాక్టర్ మల్లిక, జీవశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ మిథున్ రాథోడ్ ఉనారు. స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాస్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

హత్నూర, సెప్టెంబర్13: ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని పన్యాలలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి లింగం పెంకుటిళ్లు శిథిలావస్థకు చేరడంతో కుటుంబసభ్యులతో కలిసి ఇంటి పక్కన వేరే ఇంట్లో నివాసం ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శిథిలావస్థకు చేరిన ఇంటి తాళం తీయడానికి ప్రయత్నించగా రాకపోవడంతో తలుపులు పగులగొట్టారు. బీరువా తాళాలు పగులగొట్టి 25 తులాల వెండి, మూడు మాసాల బంగారు నగలతోపాటు రూ.3వేలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, సెప్టెంబర్ 13: ఆర్సీపురం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలిగింపులో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంజీవ్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్, వినాయకనగర్, జ్యోతినగర్, ఎంఎన్ ఆర్ స్కూల్, కానుకుంట, కైలాష్‌నగర్, భెల్ చౌరస్తా, శ్రీనివాస్‌నగర్, ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియా, ఓల్డ్ ఆర్సీపురం, బొంబాయికాలనీ, ఆర్ఆర్ నగర్, స్నేహ అపార్ట్‌మెంట్స్, డీమార్ట్ ఏరియా, ఎల్ఐజీ, బీడీఎల్ కాలనీ, మయూరీ నగర్ కాలనీల్లో ఉదయం 10గంటల నుంచి 11.30గంటల వరకు, అమీన్‌పూర్ ఫీడర్, భెల్ బస్సు డిపో ఫీడర్‌లో ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

న్యాల్‌కల్‌లో..

కంది, సెప్టెంబర్ 13: ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని చేర్యాల్‌లో శుక్రవారం నిర్వహించిన డ్రై డేలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి సుదీర్‌రెడ్డి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

న్యాల్‌కల్, సెప్టెంబర్ 13: కల్‌బేమల్, మెటల్‌కుంట, బసంతపూర్ గ్రామాల్లో శుక్రవారం జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి అమృత పర్యటించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజశేఖర్, పంచాయతీ అధికారి సురేశ్, తదితరులు ఉన్నారు.

కొల్లూరులో టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 13: టిప్పర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్‌లోని కొమురంభీం కాలనీలో నివాసం ఉండే తన్నీరు శ్రీను(54) ప్రైవేట్ ఎంప్లాయ్. శుక్రవారం ఉదయం బైక్‌పై ఉస్మాన్‌నగర్‌కి వెళ్తున్న క్రమంలో రాఘవేంద్ర హోటల్ సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ని ఢీకొట్టింది. దీంతో శ్రీను తలకు, మిగతాచోట్ల గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

నారాయణఖేడ్, సెప్టెంబర్ 13: మండలంలోని తుర్కపల్లిలో ఖననం చేసిన వృద్ధురాలి మృతదేహానికి శుక్రవారం డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. డీఎస్పీ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన రాజమ్మ(50) మృతి చెందగా ఆమె అంత్యక్రియలు గురువారం జరిగాయి. ఆమె కొడుకు బంటు శ్రీనివాస్ తన తల్లిని కొట్టి చంపాడని అనుమానిస్తూ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు శుక్రవారం అంత్యక్రియలు జరిగిన స్థలాన్ని పరిశీలించి పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. రాజమ్మ కొడుకు జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసగా మారి తల్లిని వేధించేవాడని గ్రామస్తులు, బంధువులు ఆరోపిస్తున్నారు. డీఎస్పీ సహా సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డిల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తిరిగి ఖననం చేశారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, సెప్టెంబర్ 13: పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు జీహెచ్ ఎంసీ డివిజన్‌లోని చైతన్యనగర్, శిశుమందిర్ కాలనీల్లో రూ.20 లక్షల అంచనాతో నిర్మించనున్న రహదారుల పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయన్నారు. కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ పటాన్‌చెరు పట్టణంలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, అప్జల్, వెంకటేశ్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కు అందజేస్తున్న నాయకులు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 13: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, హద్నూర్ పీఏసీఎస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని హద్నూర్‌లో గుంజోట్టికి చెందిన బొమ్మ సుక్కమ్మ, బండి శంకర్, శ్రీనుపాటిలకు మంజూరైన రూ.1.60 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంగ్రాంపాటిల్, అశోక్, ప్రభాకర్, దేవదాస్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు

కంది, సెప్టెంబర్ 13: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా విద్యనభ్యసించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కంది జడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె విద్యా ప్రాముఖ్యత, మానసిక ఒత్తిడిని అధిగమించే విధానాలు, బాలికల రక్షణ, భద్రత చట్టాలు, సోషల్ మీడియా సమస్యలు, హెల్ప్‌లైన్ నంబర్లు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, రుతుక్రమ పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సాయి శంకర్, ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, డాక్టర్ అర్చన, పంచాయతీ కార్యదర్శి విద్యాదర్‌గౌడ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

సంగారెడ్డి, సెప్టెంబర్ 13: జాతీయ లోక్ అదాలత్‌లో బ్యాంకు, ఇన్సూరెన్సు, చిట్‌ఫండ్స్ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో జాతీయ లోక్‌అదాలత్ సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని జిల్లా కోర్టులో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ రమేశ్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి సనీతారవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో మోటార్ వాహనాలు ప్రమాదాల కేసులు, బ్యాంకు మొండి బకాయిలు, చిట్‌ఫండ్ కేసులు, రాజీపడే అన్ని కేసులను త్వరితంగా పరిష్కరించి, కక్షిదారులకు న్యాయం అందేలా చూడాలన్నారు.

సౌకర్యాల కల్పన అభినందనీయం

కోహీర్, సెప్టెంబర్ 13: విద్యార్థుల అవసరాలను గుర్తించి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని ఎంఈవో శంకర్ శుక్రవారం పేర్కొన్నారు. కోహీర్ బాలికల ఉన్నత పాఠశాలలో రాక్‌వూల్ పరిశ్రమ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు, తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. సెయింట్ గోబెన్ ప్రతినిధులు ఫణికుమార్, ప్రసాద్, నితిన్‌కుమార్, రమేశ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు జాకీర్‌హుస్సేన్, ఆశాలత, అబ్దుల్‌సత్తార్, సురేశ్, ఎలిజబెత్, ఆనందం ఉన్నారు.


శ్రద్ధాంజలి
జననం: 13-07-1938
మరణం: 01-09-2024
కీ॥శే॥ శ్రీ డా॥ అల్లాణి కిషన్‌రావు
గ్రామం: నందిగామ, మండలం: పటాన్‌చెరు
మీరు మా నుండి భౌతికంగా దూరమైనా, మీ జ్ఞాపకాలు మా నుండి వీడలేదు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని మనసారా అశ్రునయనాలతో భగవంతుని ప్రార్థిస్తున్నాం. బాధాతప్త హృదయాలతో...
భార్య: డా॥ అల్లాణి రక్మిణి
తమ్ముళ్ళు-మరదళ్ళు: ఎ. ప్రభాకర్‌రావు-నిర్మల, ఎ. శ్యాంరావు-విజయలక్ష్మి, ఎ. రఘునాథరావు-అనంతలక్ష్మి, ఎం. గిరిధర్-వనజ
చెల్లెల్లు-బావలు: సుజాతమ్మ-కీ॥శే॥ బాలకిషన్‌రావు, పారిజాతమ్మ-కీ